



ఇచ్చోడలో ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తున్న ట్రైనీ కలెక్టర్

ఓటుహక్కుపై అవగాహన కల్పించాలి

● ట్రైనీ కలెక్టర్ వికాస్ మెహతా

ఇచ్చోడ, ఏప్రిల్ 2: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని జిల్లా ట్రైనీ కలెక్టర్ వికాస్ మెహతా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మహాత్మాగాంధీ జ్యోతిబాఫూలే పాఠశాలలో స్వాప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధితో పాటు ప్రజా శ్రేయస్సుకు ముడిపడి ఉన్న ఓటు హక్కును ఎట్టి పరిస్థితిల్లోనూ దుర్వినియోగం చేయవద్దని అన్నారు. నాయకుల ప్రలోభాలకు లొంగకుండా ధైర్యంగా ఓటు వేయాలని ఆయన సూచించారు. అంతకుముందు ఎంపీడీవో కార్యాలయం నుంచి శివాజీ చౌక్ మీదుగా మండల అధికారులు, స్థానిక పంచాయతీ అధికారులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఓటుహక్కు అందరి బాధ్యత అంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో స్వీప్ అధికారి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో లక్ష్మణ్, తహసీల్దార్ తుకారాం, డీటీ రామారావ్, ఎంఈవో ఉదయ్‌రావ్, ఈవో సూర్యప్రకాష్, ఎంపీవో సాయిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



నేతల.. బుజ్జగింపులు

- జిల్లాలో అసంతృప్త నేతల మద్దతును కూడగడుతున్న అభ్యర్థులు
- కాంగ్రెస్, బీజేపీలోకి పోటాపోటీగా సాగుతున్న చేరికలు
- రాజకీయ భవిష్యత్తుకు బాటలు వేసుకుంటున్న నేతలు
- వ్యూహాలకు పదునుపెడుతున్న ప్రధాన పార్టీలు
- జిల్లావ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ మరింత పెరుగుతున్న పొలిటికల్ హీట్

ఆదిలాబాద్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్ది పొలిటికల్ హీట్ మరింత పెరుగుతోంది. ఇప్పటికే ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారు కావడంతో గెలిచేందుకు పక్కా ప్లాన్‌తో ముందుకెళ్తున్నారు. టికెట్ ఆశించిన దక్కకపోవడంతో గత కొంత కాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ అసంతృప్తితో కనిపిసున్న నేతల ను బుజ్జగించే ప్రయత్నాలు చేస్తున్నారు. అధిష్ఠానం పెద్దలే రంగంలోకి దిగి పార్టీ క్యాడర్ చేజారి పోకుండా ప్రయత్నాలు చేస్తున్నారు. నేరుగా ముఖ్య నేతలకు ఫోన్ చేస్తూ రాజకీయ భవిష్యత్తుపై భరోసాను కల్పిస్తున్నారు. అయితే బీజేపీలోనే ఎక్కువగా అసమ్మతి కనిపించడంతో ఆ పార్టీ అభ్యర్థికి కొంత ఇబ్బందికరంగానే మారింది. కాంగ్రెస్‌లో పెద్దగా అసమ్మతి లేకపోయినా.. చేరికలపైనే నేతలు ప్రధానంగా దృష్టి సారిస్తున్నారు. బీఆర్ఎస్‌లో మాత్రం భిన్నమైన పరిస్థితే కనిపిస్తుంది. ఉన్న క్యాడర్‌ను కాపాడుకునేందుకు పడరాని తంటాలు పడుతుంది. ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్ది నేతల వలసలు పెరుగుతున్నాయి. ప్రధాన పార్టీల అభ్యర్థులంతా నిత్యం పార్లమెంట్ పరిధిలోని ఆయా నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటిస్తూ గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయి నేతలను కలుస్తూ పార్టీ పరిస్థితులపై చర్చిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల వరకు జోష్‌తో కనిపించిన బీఆర్ఎస్ నేతలు అధికారానికి దూరం కావడంతో డీలాపడి పోయారు. దీంతో తటస్థంగా ఉన్న నేతలను తమవైపునకు తిప్పుకునేందుకు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయి. సిట్టింగ్ స్థానాన్ని మళ్లీ తన ఖాతాలో వేసుకునేందుకు బీజేపీ ఆరాట పడుతుండగా ఎలాగైనా ఈసారి గెలిచి తీరాలన్న పట్టుతో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కనిపిస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో పై చేయి సాధించేందుకు ప్రధాన పార్టీలు వ్యూహాలకు పదును పెడుతు ముందుకెళ్తున్నాయి.

టార్గెట్ బీఆర్ఎస్


బీఆర్ఎస్ పార్టీ నేతలే టార్గెట్‌గా కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఎత్తుకుపైఎత్తులు వేస్తున్నాయి. అధికారాన్ని ఆశగా చూపుతు మరింత బలపడేందుకు కాంగ్రెస్ ప్రయత్నాలు చేస్తుండగా మళ్లీ గెలుపు ఖాయమన్న ధీమాతో బీజేపీ కనిపిస్తుంది. ఇప్పటికే పలువురు బీఆర్ఎస్ నేతలను పార్టీలో చేర్చుకున్న కాంగ్రెస్, బీజేపీలు మరికొంత మంది వలస నేతల జాబితాను సిద్ధం చేసుకుని ఆపరేషన్ ఆకర్ష్‌కు తెరలేపుతుంది. బీజేపీ



పార్టీ అభ్యర్థి బీఆర్ఎస్‌కు చెందిన నేతనే కావడంతో ఆ పార్టీ నేతలతో ఉన్న సంబంధాలు, పరిచయాలతో మరింత మద్దతును కూడగడుతున్నారు. ఎన్నికల తర్వాత నామినెట్ పదవులతో పాటు పంచాయతీ, మున్సిపల్, పరిషత్ ఎన్నికల్లో అవకాశం కల్పిస్తామంటూ కాంగ్రెస్ మరింత బలపడే ప్రయత్నం చేస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ పూర్తిగా డీలాపడి పోవడంతో ఆ పార్టీ నేతలు బీజేపీ, కాంగ్రెస్ పార్టీల వైపు మొగ్గు చూపుతున్నారు. ఆదిలాబాద్ నియోజక వర్గంలో బీఆర్ఎస్ నుంచి వలసలు కొనసాగుతుండగా బోథ్‌లో ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అడ్డుకట్ట వేసే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇటీవల తాంసి ఎంపీపీ భర్త శ్రీధర్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరడంతో బీఆర్ఎస్‌కు కొంత ఇబ్బందికరంగానే మారిందంటున్నారు. ఇప్పటికే డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్, పలువురు జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ముఖ్య నేతలు పార్టీని వీడడంతో కారుపార్టీకి కష్టకాలం మొదలయ్యిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పక్కా హామీతోనే..

ఇన్నాళ్లు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్న అసమ్మతి నేతలంతా పక్కా హామీతోనే పార్టీలో పని చేసేందుకు సిద్ధమతున్నారు. పార్టీ అభ్యర్థి గెలుపు ఎలా ఉన్నా.. తమ రాజకీయ భవిష్యత్తు ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఎన్నో అష్టకష్టాలు పడి టికెట్ దక్కించుకున్న అభ్యర్థులు అసమ్మతి నేతలను తమదారికి తెచ్చుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. ఇప్పటికే సిట్టింగ్ ఎంపీ బాపురావును అధిష్ఠానం పెద్దలు పిలిపించి కేంద్రస్థాయిలో నామినెట్ పదవి ఇస్తామని హామీ ఇవ్వడంతో ఆయన పార్టీ అభ్యర్థి గెలుపునకు సహకరించేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. అలాగే మాజీ ఎంపీ రాథోడ్ రమేష్‌తో కూడా రాజీ కుదిరినట్లు తెలుస్తుంది. బోథ్ మాజీ ఎమ్మెల్యే బాపురావుకు అధిష్ఠానం పెద్దలు నచ్చ చెప్పడంతోనే వెనుకడుగు వేసినట్లు సమాచారం. తాజాగా సోకటి దశరథ్‌ను ఆ పార్టీ అభ్యర్థి గోడం నగేష్ మర్యాదపూర్వకంగా కలుసుకుని మద్దతు ఇవ్వాలని కోరడంతో ఒకే చెప్పినట్లు తెలిసింది. పార్లమెంట్ ఎన్నికల తర్వాత ముఖ్య నేతలందరికీ పార్టీ పదవులతో పాటు ప్రాధాన్యతను ఇస్తామని అధిష్ఠానం హామీ ఇచ్చినట్లు చర్చించుకుంటున్నారు. కాంగ్రెస్‌లో ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ దంపతులు టికెట్ దక్కకపోవడంతో కొంత అసంతృప్తిని వ్యక్తం చేసినా.. జిల్లాస్థాయిలో కీలకమైన పదవిని ఇచ్చేందుకు అధిష్ఠానం హామీ ఇవ్వడంతో వెనక్కి తగ్గినట్లు తెలుస్తుంది. మరికొంత మంది ముఖ్య నేతలు కూడా మెత్తబడినట్లు కనిపిస్తుంది. ఎన్నికలే అదునుగా అసమ్మతి నేతలంతా తమ రాజకీయ భవిష్యత్తుకు బాటలు వేసుకు నే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్నికలకు ముందు ఎలాంటి వ్యతిరేకత రాకుండా ప్రధాన పార్టీలు జాగ్రత్త పడుతున్నాయి. సామాజికవర్గాల వారీగా నాయకత్వాన్ని బలోపేతం చేస్తూ ముందుకెళ్తున్నాయి. లోక్‌సభ ఎన్నికల పుణ్యమా అంటూ ఇన్నాళ్లు అడ్రస్సే లేకుండా పోయిన నేతలంతా.. ప్రస్తుతం జిల్లా రాజకీయాల్లో కీలకంగా మారుతున్నారు.





ఉట్నూర్‌లోని క్రీడాపాఠశాలను సందర్శించి పరిస్థితులు తెలుసుకుంటున్న శిక్షణ సహాయ కలెక్టర్ కిరణ్మయి

గిరిజన క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించడం అభినందనీయం

● శిక్షణ సహాయ కలెక్టర్ కిరణ్మయి

ఉట్నూర్, ఏప్రిల్ 2: ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గిరిజన సంక్షేమ శాఖ ఆదర్శ క్రీడా పాఠశాలల విద్యార్థులు జాతీయ స్థాయి క్రీడల్లో రాణించడం అభినందనీయమని శిక్షణ సహాయ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. మంగళవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆదర్శ క్రీడా పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటేనే ఉన్నత శిఖరాలకు ఎదుగుతారన్నారు. మనం ఎక్కడ ఉన్నా.. ఇంటి పరిస్థితులను మర్చిపోవద్దన్నారు. తల్లిదండ్రులు, గురువుల కష్టాలను గుర్తు చేసుకుంటూ కష్టపడి చదవాలన్నారు. ఈ సందర్భంగా క్రీడా పాఠశాలలో జీమ్‌గది, క్రీడా గది, క్రీడా మైదానాలను పరిశీలించారు. జిల్లా క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి శిక్షణ సహాయ కలెక్టర్‌కు జిల్లాలో ఏర్పాటు చేసిన క్రీడా పాఠశాలల గురించి వివరించారు. జాతీయస్థాయి క్రీడాకారులను శిక్షణ సహాయ కలెక్టర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీడీ దిలీప్‌కుమార్, ఏటీడీవో క్రాంతి కుమార్, ఏవో రాంబాబు, ప్రధానోపాధ్యాయుడు ఉత్తం, హేమంత్‌కుమార్, కోచ్‌లో సునంద, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న అంతర్ రాష్ట్ర పోలీసు అధికారులు

పోలీసు ఉన్నతాధికారుల సమావేశం

ఆదిలాబాద్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అంతర్ రాష్ట్ర సరిహద్దు పోలీసు అధికారుల సమావేశాన్ని నిర్వహించారు. మంగళవారం ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా సరిహద్దుల్లో చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఇరు రాష్ట్రాల పోలీసు అధికారులు పార్లమెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు సమన్వయంతో పని చేయాలని నిర్ణయించారు. ముఖ్యంగా అక్రమ నగదు, మద్యానికి అడ్డుకట్ట వేయాలని నిర్ణయించారు. ఇందులో మాహోర్ డీఎస్పీ సింగారే, మాండ్వి ఇన్‌స్పెక్టర్ గఫార్‌షేక్, ఆదిలాబాద్ పట్టణ సీఐలు, తదితరులు పాల్గొన్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఎఫ్‌టీటీం అధికారులు

జైనథ్‌లో కొనసాగుతున్న తనిఖీలు

జైనథ్, ఏప్రిల్ 2: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జైనథ్ మండలంలోని పిప్పర్‌వాడ, ఆనంద్‌పూర్‌లతో పాటు మండల కేంద్రమైన జైనథ్‌లో ఫ్లయింగ్ స్క్వాడ్ టీం వచ్చిపోయే వాహనాలను విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్‌టీ టీం బృందం అధికారి టి.శ్రీనివాస్ మాట్లాడుతూ రూ.50 వేలపైగా నగదును తీసుకెళ్తే సరైన ఆధారాలు రశీదులు ఉండాలన్నారు. లేనిపక్షంలో సీజ్ చేసి ఆదాయపు పన్ను అధికారులకు అప్పగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్ నరేష్, హోంగార్డు అనిల్, డ్రైవర్ జహీర్‌లతో పాటు ఎస్ఎఫ్‌టీ సిబ్బంది పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

బుధవారం	గురువారం
ఇఫ్తార్ సా.6.34	సహర్ ఉ.4.46



ఎవడు ఒక సత్కార్యం చేస్తాడో.. అతనికి దానికి పది రెట్లు ప్రతిఫలం అందుతుంది. ఎవడు పాపకార్యం చేస్తాడో దానంతటి శిక్ష ఉంటుంది.

సంక్షిప్త సమాచారం



ఇఫ్తార్ విందులో పాల్గొన్న డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి

ఖుర్షిద్‌నగర్‌లో ఇఫ్తార్ విందు

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 2: పట్టణంలోని స్థానిక ఖుర్షిద్‌నగర్‌లో నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. ఈ ఇఫ్తార్ కాలనీకి చెందిన జావిద్ నిర్వహించగా ఇందులో పాల్గొని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో మాజీ డీసీసీబీ అధ్యక్షుడు ముడుపు దామోదర్‌రెడ్డి, అంబేద్కర్‌నగర్ కౌన్సిలర్ రషీద్ ఉల్ హక్, ఖయ్యూమ్, బాయిన్‌వార్ గంగారెడ్డి, ఖయ్యూమ్, రజా, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 2: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఏప్రిల్ 4న నిర్వహించే జడ్పీ సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులు ఎన్నికల విధుల్లో ఉన్నందున జిల్లా ప్రజా పరిషత్ సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. తిరిగి సమావేశాన్ని నిర్వహించే తేదీలను ప్రకటిస్తామని తెలిపారు.

హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ సస్పెన్షన్

ఉట్నూర్, ఏప్రిల్2: ఉట్నూర్ మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ తిరుమలను సస్పెండ్ చేయడం జరిగిందని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ దిలీప్‌కుమార్ జారీ చేసిన ఉత్తర్వుల్లో మంగళవారం పేర్కొన్నారు. కాగా, గత నెల 27న పాఠశాల విద్యార్థి కరెంట్ షాక్‌కు గురైన సంఘటనతో పాటు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ తిరుమల విధుల పట్ల నిర్లక్ష్యం వహించడాన్ని గమనించి సస్పెండ్ చేయడం జరిగిందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

బీజేపీని ఓడించాలి : లంక

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 2: ఇచ్చిన హామీలను విస్మరించిన బీజేపీని ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు లంక రాఘవులు అన్నారు. మంగళవారం సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల కాలంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబించిందన్నారు. నిత్యావసర ధరలను పెంచిందని, ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేలా బడ్జెట్‌లో కోత విధించిందని ఆయన ఈ సందర్భంగా ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని కోరారు. అదేవిధంగా రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికల్లో కూలీలకు కూలిబంధు కింద రూ.12 వేలు అందిస్తామని ప్రకటించారని, కానీ ఇప్పటి వరకు అందించ లేదన్నారు. ఇచ్చిన హామీలను విస్మరిస్తున్న ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు.

ఉపాధి కూలీలకు వసతుల కరువు!

● నీడ కల్పించని అధికారులు ● ఉట్నూర్ మండలంలోని 37 గ్రామ పంచాయతీల పరిధిలో కొనసాగుతున్న వంద రోజుల పని దినాలు



శ్యామ్‌పూర్ ప్రాంతంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

ఉట్నూర్, ఏప్రిల్ 2: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీ పని చేస్తున్న కూలీలకు పని ప్రదేశంలో వసతులు కల్పించాల్సి ఉన్నా.. సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఉపాధి కూలీలు వాపోతున్నారు. ఉట్నూర్ మండలంలోని 37 గ్రామ పంచాయతీల పరిధిలో వంద రోజుల పని దినాలను కూలీలకు కల్పించడంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు.. తిరిగి సాయంత్రం వేళల్లో కూలీలు తమ నిర్దేశించిన పనులను పూర్తి చేసుకుంటున్నారు. అయితే, రైతుల భూముల్లో రైతులకు ప్రయోజనం కలిగించే విధంగా ఉపాధి పనులు చేపట్టి కూలీలకు ఉపాధి కల్పించాలని ప్రభుత్వం ఆదేశించడంతో ఉపాధి హామీ సిబ్బంది కూలీలకు పంట పొలాల్లో ఉపాధి పనులు చూపెడుతున్నారు. పంట పొలాల్లో రాళ్ల కట్టలు, ఆనకట్టలు లాంటి పనులు చేపడుతున్నారు. ఉట్నూర్, షాంపూర్, నాగపూర్, ఏంద, ఉమ్రి, నర్సాపూర్‌బి, దంతనపల్లి, పులిమడుగు, సాలెవాడ(కె), సాలెవాడ(బి), తాండ్ర, బాబాపూర్, చందూరి, హస్నాపూర్, మారుగూడ, తదితర గ్రామ పంచాయతీల పరిధిలో ఉపాధి హామీ ఫీల్డ్‌అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్ల ఆధ్వర్యంలో పనులు నిర్వహిస్తున్నారు. ఒకవైపు ఎండలు మండిపోతున్న కూలీలకు పని ప్రదేశంలో టెంట్లు వేసి నీడ కల్పించడంలో ఉపాధి సిబ్బంది విఫలమయ్యారు. అదేకాకుండా నీటి సౌకర్యం కూడా కల్పించడం లేదు. గతంలో ప్రతీ కూలీ తమ వెంట తెచ్చుకున్న నీటికి రూ.మూడు నుంచి రూ.ఐదు ఉపాధి హామీ సిబ్బంది చెల్లించేవారు. కానీ ప్రభుత్వం ఈ నిబంధనలు తీయడం వల్ల నీరు కల్పించే వీలు లేకపోవడంతో కూలీలు పని ప్రదేశంలో నీటి కోసం తహతహలాడుతున్నారు. అంతేకాకుండా రోజుకు రూ.300 కూలి పడే విధంగా ఉపాధి హామీ కూలీలు పనులు చేపట్టాలని స్థానిక అధికారులు ఆదేశిస్తుండడంతో ఉపాధి హామీ కూలీలు పూర్తి పనులు నిర్వహిస్తున్నారు. ఇంత చేస్తున్న సకాలంలో కూలీలకు డబ్బులు రావడం లేదని కూలీలు వాపోతున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న గ్రామీణ ఉపాధి హామీ పథకం వంద రోజుల పనులు పూర్తి చేసిన కూలీలకు వెంటనే కూలి డబ్బులు చెల్లించాలని కూలీలు కోరుతున్నారు.

సిబ్బంది లేక ఇబ్బందులు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు పూర్తి చేసిన కూలీలకు కూలి డబ్బులు అందించే విధంగా క్షేత్రస్థాయి సిబ్బందితో పాటు సాంకేతిక సిబ్బంది సకాలంలో మాస్టర్లు రాసి కూలి డబ్బులు ఇప్పించాల్సి ఉంటుంది. కానీ సిబ్బంది లేకపోవడం వల్ల కూలీల డబ్బులు చెల్లింపులలో జాప్యం జరుగుతుందని కూలీలు అంటున్నారు. ఉట్నూర్ మండలంలో 37 గ్రామ పంచాయతీలో కేవలం ఏడుగురు మాత్రమే టెక్నికల్ అసిస్టెంట్లు మల్లేష్, సాజిద్, రమేష్, ముంజం రమేష్, లత, శ్రీనివాస్, రావణ్‌లు ఉన్నారని అంటున్నారు. అయితే ఒక్కో కూలీ వారానికి రూ.1300 మేర పని చేసే అవకావం ఉండడంతో నెలకు రూ.ఐదు నుంచి రూ.6వేలు కూలీలకు గిట్టుబాటు అవుతుందని వెంట వెంటనే పనులు రికార్డు చేసి సకాలంలో కూలీలకు బిల్లులు చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కూలీలు కోరుతున్నారు. ఇదేకాకుండా పని ప్రదేశంలో నీడ, నీటి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

పార్లమెంట్ ఎన్నికల విధులపై

సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలి

● కలెక్టర్ రాజార్షి షా ● ఇచ్చోడ, ఆదిలాబాద్‌లో పార్లమెంట్ ఎన్నికల సిబ్బంది శిక్షణ తరగతుల పరిశీలన ● పలు సూచనలు,సలహాల అందజేత

ఇచ్చోడ, ఏప్రిల్ 2: లోక్‌సభ ఎన్నికల్లో విధులు నిర్వహించే సిబ్బంది ఈవీఎంలు, వీవీప్యాట్‌ల పనితీరు, యంత్రాల అనుసంధానంపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని కలెక్టర్ రాజార్షి షా అన్నారు. ఇచ్చోడ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది శిక్షణ తరగతులను మంగళవారం జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ.. మాస్టర్ ట్రేనీలు విధులపై సమగ్ర అవగాహన కల్పించాలన్నారు. గత ఎన్నికల అనుభవాలను పరిగణనలోకి తీసుకోని లోటుపాట్లు జరగకుండా జాగ్రత్తపడాలాన్నారు. ఎన్నికల సిబ్బంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలని ఆయన సూచించారు. దాదాపు 500 మంది సిబ్బంది ఎన్నికల శిక్షణకు హాజరైనట్లు అధికారులు తెలిపారు. పోలింగ్ తర్వాత ఈవీఎంల నిర్వహణ, పోలింగ్ రోజు మాక్ పోలింగ్ ఎలా చేయాలి, ఎలాంటి పనులు చేయొచ్చు, ఎలాంటి పనులు చేయకూడదు పోలింగ్ తర్వాత ఈవీఎంల తరలింపు వంటి అంశాలపై వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ ఖుష్బుగుప్త, తహసీల్దార్ తుకారాం, తదితరులు పాల్గొన్నారు.

● శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

ఆదిలాబాద్ అర్బన్: పార్లమెంట్ ఎన్నికల విధులు నిర్వహించే పీవో, ఏపీవోకు శిక్షణ తరగతులను ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ సైన్స్ కళాశాలలో నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణ తరగతులను జిల్లా కలెక్టర్ రాజార్షిషా మంగళవారం పరిశీలించారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. ఆయనతో పాటు అదనపు కలెక్టర్ శ్యామలదేవి, తదితరులు పాల్గొన్నారు.



ఇచ్చోడ ఎన్నికల సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ రాజార్షిషా



ఆదిలాబాద్‌లో శిక్షణ వివరాలు అడిగి తెలుసుకుంటూ..

నర్సరీల్లో మొక్కలకు ప్రతీరోజు నీరు పట్టండి

కుభీర్, ఏప్రిల్ 2 : వేసవికాలం దృష్ట్యా నర్సరీల్లో మొక్కలకు ప్రతీరోజు నీటిని పట్టాలని మండల ప్రత్యేకాధికారి, ఎస్సీ కార్పోరేషన్ ఈడీ హన్మండ్లు అన్నారు. మంగళవారం సౌనారి, అంతర్ని గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించారు. వేసవికాలం కావడంతో మొక్కలు ఎండిపోయే అవకాశం ఉన్నందున, గ్రీన్‌మ్యాట్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతీరోజు నీటిని సరఫరా చేసి తొట్టిలను శుభ్రపరిచాలన్నారు. ఆయన వెంట ఇతర అధికారులు ఉన్నారు.

ఇవేం ఎండలు బాబోయ్!!

● ఆదిలాబాద్ జిల్లాలో దంచికొడుతున్న ఎండలు ● అత్యధికంగా అర్లి(టి)లో 43.0 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

ఆదిలాబాద్, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు అమాంతంగా పెరిగిపోతున్నాయి. దీంతో బాబోయ్ ఇవేం ఎండలంటూ జనం బెంబెలెత్తి పోతున్నారు. మంగళవారం జిల్లా సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 41.3 డిగ్రీలు కాగా.. కనిష్ఠంగా 23.2 డిగ్రీలు నమోదయ్యాయి. అత్యధికంగా భీంపూర్ మండలం అర్లి(టి)లో 43.0 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చాలా చోట్ల 40 డిగ్రీలకు పైగా పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రికార్డు స్థాయిలో పగటి ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఈ సీజన్‌లో ఇదే మొదటి సారి. గత పక్షం రోజుల నుంచి ఎండల తీవ్రత అధికంగా కనిపిస్తుంది. మార్చి నెలలోనే 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు కావడం గమనార్హం. ఏప్రిల్ మాసంలో ఎండల తీవ్రత మరింత ఉంటుందని వాతావరణ శాఖ నిపుణులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా ఉదయం 9గంటల నుంచే ఎండల తీవ్రత కనిపించడంతో బయటకు వెళ్లేందుకు జనం జంకుతున్నారు. అత్యవసరమైతేనే తప్ప ఎవరూ కూడా బయటకు రావడం లేదు. ఉదయం, సాయంత్రం వేళల్లోనే పనులు ముగించుకుని ఇండ్లలోకి వెళ్లి పోతున్నారు. ఈ యేడు మరింతగా ఎండల తీవ్రత ఉంటుందని ఇప్పటికే వాతావరణ శాఖ నిపుణులు హెచ్చరించారు. మండుతున్న ఎండల తీవ్రతకు చిరు వ్యాపారులు, రైతు, ఉపాధి కూలీలు సతమతమవుతున్నారు. పగలంతా వడగాలులు, రాత్రి వేలల్లో తీవ్రమైన ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. దీనికి తోడు అప్రకటిత కరెంట్ కోతలతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.


ముఖానికి స్కార్ఫ్ ధరించి వెళ్తున్న యువతి


పట్టణంలో బోసిపోయి కనిపిస్తున్న ప్రధాన రహదారి


ఎండల తీవ్రతకు నిర్మానుష్యంగా కనిపిస్తున్న తెలంగాణచౌక్


కరంజిలో ప్రవచనాలు ఇస్తున్న బాజీరావు బాబా శిష్యులు

కరంజిలో ప్రారంభమైన సప్తాహ వేడుకలు

జైనథ్, ఏప్రిల్ 2: జైనథ్ మండలంలోని కరంజి గ్రామంలో మంగళవారం బాజీరావు బాబా సప్తాహ వేడుకలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రామంలో ఏడు రోజుల పాటు కొనసాగే ఈ వేడుకల్లో గీతాపారాయణం, పుణ్యావాచనం, ప్రవచనం, హరిపాట్, గీతాపాట్ మొదలగు కార్యక్రమలు నిర్వహించబడతాయని బాజీరావు బాబా శిష్యులు తెలిపారు. వచ్చే ఆదివారం సప్తాహ వేడుకలు ముగింపు సందర్భంగా బాజీరావు పల్లకీ ఊరేగింపు, వివిధ దేవతా మూర్తుల వేషధారణ ఎడ్లబండిపై చిన్నారుల ఊరేగింపు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కరంజి గ్రామస్థులు తెలిపారు. ఈ ముగింపు కార్యక్రమానికి మండలంలోని ఆయా గ్రామాల మహిళలు భక్తులు అధికసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కరంజి గ్రామస్థులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి బిక్కి గంగన్న, గ్రామ మాజీ సర్పంచ్ ఏనుగు రతన్‌రెడ్డి, బాజీరావు, శిష్యులు గొరె మోహన్, గేడం నారాయణ, బిక్కి పొచ్చన్న, బోల్లెం అశోక్, గోరే రవీందర్‌లతో పాటు కరంజి గ్రామస్థులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మేకల అందజేత

మావల, ఏప్రిల్ 2: రైతు ఆత్మహత్య చేసుకున్న బాధిత కుటుంబానికి రైతు స్వరాజ్య వేదిక ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు సంగెపు బొర్రన్న ఆధ్వర్యంలో మేకలు పంపిణీ చేశారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని లోకారి గ్రామానికి చెందిన రైతు సంతోషం శ్రీనివాస్ గత ఆరు నెలల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. బాధిత కుటుంబానికి అండగా నిలిచేందుకు రూ.22 వేల విలువ గల మేకలను కిషన్ బంద్ రాష్ట్ర అధ్యక్షులు సతీష్ ప్రోద్బలంతో దీప్తి మనోహర్ యాదవ్‌ల ఆర్థిక సహాయంతో ఆ రైతు కుటుంబానికి అందజేశారు.


బాధిత కుటుంబానికి మేకలను అందజేస్తున్న దృశ్యం

సర్దార్ పాపన్నగౌడ్‌కు ఘన నివాళి

● వర్ధంతిలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయల శంకర్

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 2: బహుజనుల రాజ్యాధికారమే లక్ష్యంగా పోరాటం చేసిన మహనీయుడు సర్దార్ పాపన్నగౌడ్ అని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. సర్దార్ పాపన్నగౌడ్ వర్ధంతి సందర్భంగా స్థానిక బస్టాండ్ ఎదురుగా ఉన్న ఆయన స్మారక విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వారికి రాజ్యాధికారాన్ని అందించాలని ఆకాంక్షించిన మహనుభావుడని అన్నారు. ఆ మహనుభావుడి చరిత్ర ప్రతీఒక్కరికి తెలవాల్సిన అవసరం ఉందని తెలిపారు. మహనీయులు చేసిన సేవలను నేటితరం వారు మర్చిపోతున్నారన్నారు. వారు చేసిన త్యాగాలను గుర్తించడంతో పాటు ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం బాధ్యతగా భావిస్తూ ప్రతీఒక్కరు కృషి చేయాలని కోరారు. గ్రామాల్లో పాపన్న విగ్రహాలను ప్రభుత్వ ఖర్చులతో ఏర్పాటు చేయాలని, ఈ విషయంలో అసెంబ్లీలో ప్రస్తావిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు లాలామున్న, విజయ్, మయూర్‌చంద్ర, అశోక్, చిల్కూరు జ్యోతిరెడ్డి, భీంసేన్ రెడ్డి, కార్యకర్తలు, గౌడ కుల సభ్యులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

● పట్టణ రజక సంఘ ప్రమాణ స్వీకారం

ఆదిలాబాద్ అర్బన్: పట్టణ రజక సంఘం కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని స్థానిక ఆర్ఎస్ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాయల శంకర్, బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రజక సంఘం పట్టణ అధ్యక్షుడిగా ఎన్నికైన మల్యువార్ సంతోష్, ప్రధాన కార్యదర్శి ముస్కు వినోద్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో నగేష్, విజయ్, మయూరిచంద్ర, చిలుకూరు జ్యోతిరెడ్డి, అశోక్, అశోక్, ముస్తాపురే, బీజేపీ నాయకురాలు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

● 'దేశంలో సుస్థిర పాలన బీజేపీతోనే సాధ్యం'

జైనథ్: భారతదేశంలో దేశ సుస్థిర పాలన బీజేపీ పార్టీ కేంద్రంలో అధికారంలో ఉన్న పీఎం నరేంద్రమోదీతోనే సాధ్యమని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ స్పష్టం చేశారు. మంగళవారం జైనథ్ మండలంలోని నిరాల గ్రామంలోని త్రినేత్ర గార్డెన్‌లో ఆదిలాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్‌తో కలిసి బీజేపీ పార్టీ మండల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెలే మాట్లాడుతూ ప్రధానమంత్రి ఎవరో కూడా చెప్పుకోలేని పరిస్థితిల్లో ఇండియా కూటమి ఉందని విమర్శించారు. మళ్లీ ప్రధానిగా మోదీ కావాలనే ఆకాంక్ష దేశ ప్రజల్లో ఉందన్నారు. ఎంపీ అభ్యర్థికి బీజేపీ కార్యకర్తలు నాయకులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుముస్తాపురే అశోక్, పార్లమెంట్‌కో కన్వీనర్ మయూర్‌చంద్ర, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి సీహెచ్ జ్యోతిరెడ్డి, జైనథ్ మండల పార్టీ అధ్యక్షులు కట్కం రాందాస్‌లతో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే


నిరాల సమావేశంలో మాట్లాడుతున్న పాయల శంకర్



గిమ్మా పీహెచ్‌సీ అవగాహన సదస్సులో పాల్గొన్న వైద్య సిబ్బంది

మహిళలు సాధికారత దిశగా ముందుకు సాగాలి : జిల్లా కోఆర్డినేటర్

జైనథ్, ఏప్రిల్ 2: సమాజంలోని మహిళల లింగ వివక్షత లేకుండా మహిళ సాధికారత దిశగా ముందుకు సాగాలని జిల్లా మహిళ సాధికారత కేంద్రం, సఖీ కేంద్రం ఆదిలాబాద్ జిల్లా కో ఆర్డినేటర్ యశోధ అన్నారు. మంగళవారం జైనథ్ మండలంలోని గిమ్మా ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలు ఆశా వర్కర్లకు వైద్య సిబ్బందికి మహిళ సాధికారతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కో ఆర్డినేటర్ యశోధ మాట్లాడుతూ భేటీ పడావో.. భేటీ బచావో పథకం, పీసీ పీఎన్‌డీటీ చట్టం, గృహ హింస చట్టం, పని చేసే చోట లైంగిక వేదింపులపై సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమంలో గిమ్మా ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సూచలతో పాటు ఆయా గ్రామాల ఏఎన్ఎంలు ఆశావర్కర్లు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్యం, నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

● గ్రామాల్లో పర్యటించిన ఎంపీడీవో మోహన్‌రెడ్డి

తాంసి, ఏప్రిల్ 2: మండలంలోని ఆయా గ్రామాలలో చేపడుతున్న పారిశుధ్య, నర్సరీలపై ప్రత్యేకశ్రద్ధ చూపాలని ఎంపీడీవో గడ్డం మోహన్‌రెడ్డి అన్నారు. పారిశుధ్యం పనులలో భాగంగా మంగళవారం మండలంలోని లింబుగూడ, అట్నంగూడ గ్రామాలలో ఆయన పర్యటించారు. పనులు ఎలా జరుగుతున్నాయో? క్షుణ్ణంగా పరిశీలించారు. నర్సరీలలో మొక్కలు ఏ మేరకు పెరుగుతున్నాయో చూశారు. పారిశుధ్యం పనులు ఎలా జరుగుతున్నాయో? పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పారిశుధ్యం పనులను వేగవంతం చేయాలన్నారు. మొక్కల పెంపకంపై సంబంధిత శాఖ సిబ్బంది, అధికారులు, గ్రామాల కార్యదర్శులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించడం జరుగుతుందని అన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పలు పనులను ఆయన పరిశీలించారు.


లింబుగూడలో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో, అధికారులు


అట్నంగూడలో పాడైన బావిని పరిశీలిస్తూ..


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న రోకండ్ల రమేష్

గిట్టుబాటు ధరతో పంటలను కొనాలి

● మాజీ రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 2: ఇటీవల కురిసిన అకాల వర్షం, వడగాళ్ల వానతో నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25 వేలు ఇవ్వాలని మాజీ రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ రోకండ్ల రమేష్ అన్నారు. మంగళవారం శనగ, మొక్కజొన్న పంటలకు గిట్టుబాటు ధరలతో, రూ.500 బోనస్‌తో కొనాలని కోరుతూ కలెక్టర్ రాజార్షిషాకు వినతిపత్రం అందించారు. అకాల వర్షం, వడగాళ్ల వర్షంతో నష్టపోయిన రైతుల సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా రైతు సమన్వయ సమితి మాజీ కోఆర్డినేటర్ రోకండ్ల రమేష్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన అకాల వర్షం, వడగాళ్ల వర్షం కారణంగా రైతులు తమ పంటలను తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ప్రభుత్వం నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25వేల చొప్పున పరిహారం ఇవ్వాలని కోరారు. అదేవిధంగా కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు అనుగుణంగా వరి పంటకు బోనస్ రూ.500 చెల్లించాలన్నారు. శనగ, మొక్కజొన్న పంటలను గిట్టుబాటు ధరలతో కొనాలని కోరారు. రైతుబంధురైతుభీమాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ఉద్యమాలు చేపడుతామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణ, జైనథ్, ఆదిలాబాద్ ఎంపీపీలు గోవర్ధన్, రమేష్, మెట్టు ప్రహ్లాద్, దాసరి రమేష్, కుమ్ర రాజు. తదితరులు పాల్గొన్నారు.

రాజస్థాన్ మహిళల ఆధ్వర్యంలో ఘనంగా గంగౌరి పూజలు

బైంసా, ఏప్రిల్ 2 : రెవెన్యూ డివిజన్ కేంద్రమైన బైంసాలోని పద్మావతీ కాలనీలో రాజస్థాన్ మహిళలు మంగళవారం గంగౌరి పూజలను ఘనంగా నిర్వహించారు. సైనీ సరోజ్‌దేవి, గోపాల్ దంపతుల ఆధ్వర్యంలో జరిగిన పూజ కార్యక్రమంలో స్థానిక నివాసముంటున్న 50కి పైగా కుటుంబాల నుంచి 100 మందికి పైగా మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజస్థాన్ మహిళలు పార్వతీదేవి ప్రతిమను శోభాయమానంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేకపూజలు చేపట్టారు. కాలనీ పరిధిలో పార్వతీదేవి ప్రతిమతో శోభాయాత్ర నిర్వహించారు. శివపార్వతుల గేయాలను ఆలపిస్తూ నృత్యాలు చేశారు. వైవాహిక విశ్వసనీయత, దాంపత్య ఆశీర్వాదం, వివాహిత స్త్రీలు తమ భర్తలు, కుటుంబీకుల క్షేమం, ఆరోగ్యం కోసం గంగౌరి పూజలు నిర్వహిస్తామని తెలిపారు.


గంగౌరి పూజల్లో పాల్గొన్న రాజస్థాన్ మహిళలు


వైద్య విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేస్తున్న కలెక్టర్ రాజార్షిషా

వైద్య వృత్తి ఎంతో పవిత్రమైంది : కలెక్టర్

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 2: వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనది అని జిల్లా కలెక్టర్ రాజార్షిషా అన్నారు. జిల్లాకేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిలో రాజీవ్‌గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ కళాశాల 11వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్య క్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ హాజరై మాట్లాడారు. బలహీన వర్గాల ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ముందుండాలని ఆయన సూచించారు. అనంతరం 2018 బ్యాచ్‌కు చెందిన మొత్తం 101 మంది ఎంబీబీఎస్ విద్యారులకు కలెక్టర్ పట్టాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, మెడికల్ కళాశాల సూపరింటెండెంట్ ఇంద్రిస్ అక్బనీ, వైద్య కళాశాల డీన్ డాక్టర్ వంజరి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సరోజ, విద్య విల్సన్, ఫోరెన్సీ హెచ్‌వోడీ కరుణాకర్, బయోకెమిస్ట్రీ హెచ్‌వోడీ రత్నకుమారి, అనస్థీషియా హెచ్‌వోడీ చంద్రశేఖర్, వైద్యులు, వైద్య విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

లక్ష్మణచాంద, ఏప్రిల్ 2 : డీసీఎంఎస్ ఆధ్వర్యంలో మండలంలోని లక్ష్మణచాంద, మునిపెల్లి, మల్లాపూర్, రాచాపూర్, బాబాపూర్ గ్రామాల్లో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ప్రతి క్వింటాల్‌కు ఏ గ్రేడ్ వరి ధాన్యానికి రూ. 2,203, బి గ్రేడ్ వరి ధాన్యానికి రూ. 2,183ను మద్దతు ధరగా చెల్లించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

మండలంలోని పలు గ్రామాల్లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం పలు కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో ఒకటి లేదా రెండు కొనుగోలు కేంద్రాలకే పరిమితమైన మహిళా సంఘాలు ఈసారి ఐదు కేంద్రాలను దక్కించుకున్నాయి. వడ్యాల్, నర్సాపూర్(డబ్ల్యూ), ధర్మారం, చామన్‌పెల్లి, చింతల్ చందా గ్రామాల్లో ఈ వరి కొనుగోలు కేంద్రాలను మహిళా సంఘాలకు కేటాయించగా మంగళవారం చామన్‌పెల్లి, ధర్మారం గ్రామాల్లో ప్రారంభమయ్యాయి.

లక్ష్మణచాందలో పోలీసుల కవాతు

లక్ష్మణచాంద, ఏప్రిల్ 2 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సోన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ బి. నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో కనకాపూర్ గ్రామంలో మంగళవారం పోలీసులు కవాతు నిర్వహించారు. మండల రహదారిపై పర్యటిస్తూ ప్రజారక్షణ కోసం మేమున్నామని భరోసా కల్పించేలా ప్రదర్శన చేశారు. అసాంఘిక శక్తులకు అణచి వేస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పాటుపడతామనే సంకేతం ఇచ్చారు. ఎస్సై శ్రీకాంత్, మామడ ఎస్సై సందీప్, సీఆర్పీఎఫ్ బలగాలు పాల్గొన్నాయి.

'బీజేపీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలి'

కుభీర్, ఏప్రిల్ 2 : బీజేపీ బలపరిచిన ఎంపీ అభ్యర్థి గెలుపుకోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావు పాటిల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బాలాజీ జిన్నింగ్ ఫ్యాక్టరీలో ఏర్పాటు చేసిన బీజేపీ పార్టీ కార్యకర్తల సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని దిశానిర్దేశం చేశారు. బాసర నుంచి మాహూర్ వరకు కుభీర్ మీదుగా హైవేరోడ్డు నిర్మాణం కోసం కేంద్ర మంత్రి గట్కారేకు నివేదికలను అందించామన్నారు. కుభీర్ మండలంలో సుమారు 20వేల ఎకరాలకు గడ్డెన్న సుద్దవాగు ద్వారా లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేసి సాగు నీరందిస్తానని అన్నారు. నియోజకవర్గ గ్రామాల అభివృద్ధి కోసం రూ. 140కోట్లతో పలు పనులు చేపడుతామన్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో నాయకులు వడ్నం నాగేశ్వర్, ప్యాట లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

దిలావర్‌పూర్ : భారతీయ జనతాపార్టీని ఆదరించి గెలిపించడం చారిత్రక అవసరమని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. లాభార్తి సంపర్క్ అభియాన్‌లో భాగంగా మండలంలోని మాడేగాం, లోలం, కాల్వ తండా, సిర్గాపూర్, బన్సపల్లి, సాంగ్వి, మాయాపూర్ గ్రామాల్లో పర్యటించారు

లక్ష్మణచాంద : కేంద్రంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువద్దామని బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్ మంగళవారం అన్నారు. 'లాభార్తి సంపర్క్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా మండలంలోని నర్సాపూర్(డబ్ల్యూ) గ్రామంలో కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందిన కుటుంబాలను ఇంటింటికి వెళ్లి కలిశారు.

ఉపాధి హామీ పనులు ప్రతీ ఒక్కరూ సద్వినియోగించుకోవాలి

బైంసా రూరల్, ఏప్రిల్ 2 : మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో మంగళవారం ఉపాధి హామీ పనులను డీఆర్‌డీవో విజయలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఉపాధి హామీ పనులు ప్రతి ఒక్కరూ సద్వినియోగించుకోవాలన్నారు. సమయపాలన పాటిస్తూ ఎండతీవ్రత అధికంగా ఉండడం వల్ల పనులు తొందరగా ముగించుకొని ఇంటికి వెళ్లాలని సూచించారు. జాబ్ కార్డు ఉన్న ప్రతీవ్యక్తి ఉపాధి హామీ పనులు చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో శివలింగయ్య, ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 40.5, కనిష్ఠం 27.7



నిర్మల్
జిల్లా వార్తలు

బుధవారం 3 ఏప్రిల్ 2024

నూతన పద్ధతులతో అధిక దిగుబడులు

కుంటాల, ఏప్రిల్, 2: రైతులు నూతన పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులను పొందవచ్చునని హైదరాబాద్ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్త ఉమారెడ్డి పేర్కొన్నారు. మంగళ వారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమగ్ర ఎరువుల యాజమాన్యంపై శాస్త్రవేత్త మాధవి రైతులకు వివరించారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులపై రైతులు మొగ్గు చూపాలని దీని వల్ల రైతు లకు పెట్టుబడులు తగ్గి దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. పోషక విని యోగ సామర్థ్యాన్ని మెరుగు పరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో ఏఈవోలు తదితరులు ఉన్నారు.

మొక్కజొన్న రైతు దిగాలు



నిర్మల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మొక్కజొన్న రైతు బెంబేలెత్తిపోతున్నారు. ప్రతీఏటా లాభాల సిరులు కురిపించే ఈ మొక్కజొన్న పంట ఈ సారి రైతుల కంట కన్నీరు పెట్టిస్తోంది. ఈ సారి సాగైనా మొక్కజొన్న పంటను మార్క్‌ఫెడ్ సంస్థ కొనుగోలు చేయకపోవడం ఆ పంటను సాగుచేసిన రైతులకు శాపంగా మారుతోంది. ప్రతీ ఏటా మార్క్‌ఫెడ్ సంస్థ ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో పంటను కొనుగోలు చేసేది. అయితే ఈ సారి ఆ పంటను కొనుగోలు చేసేందుకు మార్క్‌ఫెడ్‌కు ప్రభుత్వం ఇప్పటి వరకు అనుమతినివ్వకపోవడం రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. ఈ సారి ప్రభుత్వం మొక్కజొన్న పంటకు 2090 రూపాయలను మద్దతు ధరగా ప్రకటించింది. అయితే ప్రస్తుతం వ్యాపారులు దీనికి పది రూపాయలు అదనంగా జోడించి 2100 క్వింటాల్‌కు చొప్పున చెల్లిస్తున్నారు. మార్క్‌ఫెడ్ సంస్థ కొనుగోళ్ళు జరపకపోవడంతో వ్యాపారుల తరఫున పంటలను కొనుగోలు చేసేందుకు దళారులు పల్లె బాట పడుతున్నారు. అయితే ఈ సారి మార్క్‌ఫెడ్ సంస్థ కొనుగోళ్లు జరపకపోతుండడంతో రైతులంతా తప్పనిసరిగా పంటను వ్యాపారులకే అమ్ముకోవాల్సి వస్తోంది. దీనికి ఆసరాగా చేసుకుంటున్న వ్యాపారులు కొనుగోలు సమయంలో పంట డబ్బులను చెల్లించేందుకు రెండు శాతం వడ్డీని కోతగా విధిస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. అయితే రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుంటున్న వ్యాపారులు నగదు కోతతో పాటు తూకంలో కూడా మోసాలకు పాల్పడుతున్నారన్న విమర్శలున్నాయి. కాగా కల్లాల్లో నిల్వ చేసిన మొక్కజొన్న పంటను ప్రకృతి వైపరీత్యం ఏ సమయంలోనైనా నష్టం చేకూర్చవచ్చన్న ఆందోళనతో రైతులు తమ పంటను త్వరగా అమ్ముకుంటున్నారు. ఇప్పటి వరకు 40 శాతానికి పైగా రైతులు తమ పంటలను వ్యాపారులకు అమ్ముకున్నారని చెబుతున్నారు. పంట దిగుబడులు వచ్చి రోజులు గడుస్తుండడం, మార్క్‌ఫెడ్ సంస్థ కొనుగోళ్లు జరపకపోతుండడంతో రైతులు గత్యంతరం లేక వ్యాపారులకే పంటను అమ్ముకోవాల్సి వస్తోందని అంటున్నారు. ఇదిలా ఉండగా జిల్లాలోని పలు మండలాల్లో నకిలీ విత్తనాల కారణంగా పంటంతా పీడ, చీడల బారిన పడి పెద్ద ఎత్తున నష్టపోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క దిలావర్‌పూర్ మండలంలోనే 700 ఎకరాలకు పైగా మొక్కజొన్న పంట నకిలీ విత్తనాల కారణంగా నష్టాల పాలైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించి తమను ఆదుకోవాలంటూ అక్కడి రైతాంగమంతా ఇప్పటికే సంబంధిత అధికారులకు వినతిపత్రాలు సమర్పించింది. ప్రభుత్వం తమకు అండగా నిలవాలని కోరుతున్నారు.

- జిల్లాలో మార్క్‌ఫెడ్ ద్వారా మొదలుకాని కొనుగోళ్లు
- రెండు శాతం నగదు కోతతో వ్యాపారులకే అమ్మకాలు
- అడుగడుగునా నష్టపోతున్న రైతులు
- రైతుల అవసరాన్ని ఆసరా చేసుకుంటున్న వ్యాపారులు
- దీనికి తోడుగా పంటలను నష్టం చేసిన నకిలీ విత్తనాలు
- ఆదుకోవాలంటున్న అన్నదాతలు

జిల్లాలో 1.06లక్షల ఎకరాల్లో పంట సాగు

జిల్లాలో వరితో పాటు సమానంగా మొక్కజొన్న పంట సాగవుతుంటుంది. ముఖ్యంగా ఈ పంటను రైతులు బోరు బావుల కింద ఆధారపడి సాగు చేస్తుంటారు. భూసారం ఎక్కువగా ఉండడం, మార్కెట్‌లో ఈ పంటకు ధర ఆశించిన మేరకు ఉండడంతో రైతులు ఈ పంటను సాగు చేసేందుకే ప్రతీఏటా ఆసక్తి చూపుతుంటారు. అయితే ప్రతీఏటా ప్రభుత్వం మొక్కజొన్న పంటను మార్క్‌ఫెడ్ సంస్థ ద్వారా మద్దతు ధరతో కొనుగోలు చేస్తుంటుంది. ఈ సారి మాత్రం పంట కొనుగోలుకు మార్క్‌ఫెడ్ సంస్థ ముందుకు రాకపోవడంతో రైతులంతా తమ పంటను వ్యాపారులకే అమ్ముకోవాల్సి వస్తోంది. జిల్లాలో మొత్తం 1,06 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నారు. అయితే ఎకరానికి 30 నుంచి 35 క్వింటాళ్ల వరకు పంట దిగుబడి వస్తున్నట్లు సంబంధిత శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

మళ్లీ కొంపముంచిన నకిలీ విత్తనాలు

ఇదిలా ఉండగా జిల్లాలో ప్రతీఏటా నకిలీ విత్తనాలు రైతులను నట్టేట ముంచుతున్నాయి. ఇప్పటికే పలుసార్లు నకిలీ విత్తనాల కారణంగా రైతులు పెద్ద ఎత్తున పంటలను నష్టపోయారు. ముఖ్యంగా సోయాబీన్, మొక్కజొన్న పంటలకు నకిలీల పీడ వెంటాడుతోంది. నకిలీ విత్తనాల కారణంగా చీడ, పీడలు పంటలను పూర్తిస్థాయిలో నష్టాల పాలు చేస్తున్నాయి. రైతులు నకిలీ విత్తనాల కారణంగా నష్టపోయిన పంటలకు పరిహారం అందించాలని కోరుతున్నప్పటికీ ప్రభుత్వం మాత్రం స్పందించడం లేదు. ముఖ్యంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం నకిలీ విత్తనాల కారణంగా పంట నష్టపోయిన రైతులను ఇప్పటి వరకు ఆదుకోలేదు. దీంతో పాటు రైతులకు నకిలీ విత్తనాలు అంటగట్టిన వ్యాపారులపైనా గాని, సంస్థలపైనా గానీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఈ నకిలీ దందా యధేచ్ఛగా సాగుతోందని అంటున్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

● మెంచురాజు, రైతు, టెంబుర్ని



ఈ ఏడాది మొక్కజొన్న పంట బాగా వచ్చింది. అయితే కొనుగోలు కేంద్రాలు లేక ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకోవాల్సి వస్తోంది. ప్రైవేటు వ్యక్తులు ప్రభుత్వ మద్దతు ధర ఇవ్వకుండా తక్కువ ఇస్తున్నారు. వారం పది రోజులకు డబ్బులు ఇస్తున్నారు. ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే మద్దతు ధర వస్తుంది. నష్టం ఉండదు.

మద్దతు ధర చెల్లించాలి

● ముత్యం, రైతు, టెంబుర్ని



ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొని మొక్కజొన్న పంటను సాగుచేశాను. మొదట్లో చీడపీడలతో ఎంతో ఇబ్బంది పడ్డాం. మొక్కజొన్నకు ధర లేకపోతే నష్టపోతాం. ప్రభుత్వం మద్దతు ధర ఇస్తే కొంతలోకొంతైనా మేలు జరుగుతుంది. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి.

పంట చేతికి వచ్చే దళారుల పాలాయే

● సూతరి శంకర్, రైతు, నల్లుర్తి



ఆరుగాలం కష్టపడి పండించిన మొక్కజొన్నను పంట చేతికొచ్చినాక ప్రభుత్వ మద్దతు ధర ఇవ్వక కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో అప్పులు కట్టలేక దళారులను ఆశ్రయించి పంటను అమ్మినాము అవసరాల కోసం పైసలు కావాలంటే నూటికి రెండు చొప్పున కట్ చేసుకొని చేతికి ఇస్తున్నారు. ఇలా అయితే నిండా కష్టమవుతోంది. ప్రభుత్వం స్పందించి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని కోరుతున్నాం.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేవు

● ప్రవీణ్‌రెడ్డి,
జిల్లా మార్కెటింగ్ అధికారి, నిర్మల్

ఈ విషయమై జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్‌రెడ్డిని సంప్రదించగా మొక్కజొన్న కొనుగోలు చేయాలంటూ ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేవని తెలిపారు. ప్రభుత్వం ఆదేశిస్తే వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మొక్కజొన్న పంటను రైతుల వద్ద నుంచి కొనుగోలు చేస్తామని ఆయన వివరించారు. జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని, ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నామన్నారు.

హరిహర క్షేత్రంలో పంచామృతాభిషేకం



పంచామృతాభిషేకం చేస్తున్న అర్చకులు

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 2 : హరిహర క్షేత్రంలోని గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర స్వాములకు మంగళవారం పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆలయ గురుస్వామి మూర్తి ఆధ్వర్యంలో జరిగిన పూజలో ధర్మకర్త అల్లోల వినోదమ్మ, మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు. పూజకు హాజరైన భక్తులకు అన్నదానం నిర్వహించారు. యువరాజ్, సంతోష్, కోశాధికారి వేణుగోపాల్‌రెడ్డి, గురుస్వాములతో పాటు సమీప గ్రామాల నుంచి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో పూజలు



పూజలో పాల్గొన్న భక్తులు

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 2 : నిర్మల్ పట్టణం విశ్వనాథ్‌పేట్ శ్రీగిరి క్షేత్రం ఈశ్వరి మాత ఆలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్య స్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక్కడ పూజలు చేస్తే సంతాన ప్రాప్తి కలుగుతోందని, రాహుకాల దోషం, కాలసర్ప దోషం తొలగి అనారోగ్యంతో బాధపడేవారికి సంపూర్ణ ఆరోగ్యం కలుగుతోందని భక్తుల విశ్వాసం. శనిగారపు చిన్నయ్య, దేవేందర్ రెడ్డి, అప్పాల ప్రభాకర్ లత దంపతులు పాల్గొన్నారు.

2వ తేదీ నుంచి పాఠశాలల్లో ప్రేరణ ఉత్సవాలు : డీఈవో

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 2 : ఈ నెల 2 నుంచి 6 వరకు జిల్లాలోని అన్ని గుర్తింపు పొందిన పాఠశాలల్లో ప్రేరణ ఉత్సవాలు నిర్వహించాలని డీఈవో రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్పీడీ సమగ్ర శిక్ష ఆదేశం మేరకు 9 నుండి 12 తరగతులు నిర్వహించే అన్ని యాజమాన్యాల పాఠశాల, జిల్లా స్థాయిలో ఈ ఉత్సవాలు నిర్వహించాలని పేర్కొన్నారు. వికసిత భారతం - సమాజానికి, దేశానికి నా చేయూత అనే అంశాలపై వివిధ రకాల పోటీలు నిర్వహించాలన్నారు. పాఠశాల నుండి ఒక బాలుడు, బాలికను ఎంపిక చేసి వారి వివరాలు ప్రేరణ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ఎంపికైన విద్యార్థులను ఈ నెల 20న జేఎన్వీ కాగజ్‌నగర్‌లో జరిగే ప్రేరణ కార్యక్రమానికి హాజరుకావాల్సి ఉంటుందన్నారు. జిల్లా స్థాయి పోటీలు నిర్వహించి ఒక బాలుడు, ఒక బాలికను ఎంపిక చేసి గుజరాత్‌లోని వాడ్‌నగర్‌లో నిర్వహించే వారం రోజుల శిక్షణకు పంపనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు.

వైద్య కళాశాలలో ఉద్యోగాలకు రేపు వాక్ ఇన్ ఇంటర్వ్యూ

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 2 : నిర్మల్‌లోని వైద్య కళాశాలలో 44 వైద్యాధికారులు, 19 సీనియర్ రెసిడెంట్ భర్తీ కోసం గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యాధికారుల్లో 11 మంది ప్రొఫెసర్లు, 20 అసోసియేట్ ప్రొఫెసర్లు, 13 అసిస్టెంట్ ప్రొఫెసర్లు కాంట్రాక్ట్ పద్ధతిన నియామకం జరుగుతుందన్నారు. 19 సీనియర్ రెసిడెంట్లను హనరోరియం పద్ధతిన నియమించనున్నట్లు తెలిపారు. కళాశాల వెబ్‌సైట్ సందర్శించాలన్నారు. ఇంటర్వ్యూ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఉంటుందన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి : బీఆర్ఎస్

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 2 : ఎన్నికల సందర్భంగా ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. మాజీ జడ్పీ చైర్మన్ లోలం శ్యామసుందర్, మాజీ డీసీసీబీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చూడాలి



మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ మరమ్మతులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



సిరాల చెరువును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్, అధికారులు

ముథోల్, ఏప్రిల్ 2 : వేసవి కాలం దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా తగుచర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. మండలంలని ఆష్ట, రువ్వి గ్రామాలను మంగళవారం సందర్శించారు. ఇటీవల ఆ గ్రామాల్లో మిషన్ భగీరథ పైప్‌లైన్లు లీకేజీ కావడంతో సంబంధిత అధికారులు మరమ్మతులు చేయించారు. అయితే వాటిని పరిశీలించేందుకు వచ్చాడు. తాగునీటి సరఫరా నిమిత్తం మిషన్ భగీరథ ద్వారా అందుబాటులో ఉన్న వ్యవస్థను పూర్తిస్థాయిలో వినియోగించు కోవాలన్నారు. తాగునీటి సరఫరాను మండల, గ్రామస్థాయిలో ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించాలన్నారు. ప్రత్యేక అధికారులు వారంలో రెండుసార్లు, పంచాయతీ కార్యదర్శులు ప్రతీరోజు ఉదయం 8 గంటలకు గ్రామపంచాయతీలో ఉండాలన్నారు. మిషన్ భగీరథ వ్యవస్థ, స్థానికంగా అందుబాటులో ఉన్న నీటివనరులతో రూపొందించిన ప్రత్యామ్నాయ వ్యవస్థలను వినియోగించుకుంటూ గ్రామస్థాయిలో రానున్న రెండు నెలలకు తాగునీటి సరఫరా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. ప్రతి గ్రామపంచాయతీలో ఇంటి పన్ను వందశాతం పూర్తి చేయాలన్నారు. రువ్విలో వందశాతం ఇంటి పన్ను వసులు కాగా, ఆష్టలో 96 శాతం అయినట్లు కార్యదర్శులు అదనపు కలెక్టర్‌కు తెలిపారు. ఈ సందర్భంగా పలు పంచాయతీ రికార్డులు పరిశీలించారు. ఈయన వెంట డీపీవో శ్రీనివాస్, డీఎల్పీవో మోజాం హుస్సేన్, డీఈఈ లక్ష్మణ్, ఏఈ అరుణ్‌కుమార్, ఎంపీడీవో రాములు, ఎంపీవో అమీర్‌ఖాన్, పంచాయతీ కార్యదర్శులు పోతన్న, భాను గౌడ్‌లు ఉన్నారు.

సిరాల చెరువును సందర్శించిన అదనపు కలెక్టర్

భైంసా రూరల్ : గత సంవత్సరం వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్న సిరాలను చెరువును అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్ సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనతో మాట్లాడుతూ దెబ్బతిన్న చెరువుకు పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ చెరువు నీరే చుట్టు ప్రక్కల 15, 20 గ్రామాల పశువులకు దాహం తీర్చేదని, కానీ ఇప్పుడు ఈ గ్రామానికి కూడా చుక్క నీరు లేకుండా పోయిందని తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ... సిరాల చెరువు దాదాపు 320 ఎకరాలలో విస్తరించి ఉందని, దీని ఆయకట్టు 1500ల ఎకరాల వరకు ఉందన్నారు. చెరువలో చుక్క నీరు లేకపోవడం వలన భూగర్భ జలాలు కూడా తగ్గుతాయని, తాగునీటి కొరకు తగుప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల కోడ్ ఉన్నందున టెండర్ పూర్తి అయినప్పటికీ పనులు ప్రారంభం కాలేదని, అయినప్పటికీ ఎన్నికల సంఘానికి ప్రత్యేకవినతి చేసి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో డీపీవో శ్రీనివాస్, ఆర్డీవో కోమల్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ సందీప్, భైంసా ఎంఆర్‌వో ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాపన్నగౌడ్ పోరాటస్ఫూర్తితో రాజ్యాధికారాన్ని సాధిద్దాం

నిర్మల్ చైన్‌గేట్, ఏప్రిల్ 2 : సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ పోరాట స్ఫూర్తితో పోరాడి రాజ్యాధికారాన్ని సాధిద్దామని తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ అమరవేణి నర్సాగౌడ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అమరవీరుల చౌక్ (మున్సిపల్ కార్యాలయం ముందు) పాపన్న గౌడ్ విగ్రహం వద్ద గౌడజన హక్కుల పోరాట సమితి (మోకుదెబ్బ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 314వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా పాపన్నగౌడ్ చిత్రపటానికి, విగ్రహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమరవేణి నర్సాగౌడ్ మాట్లాడుతూ... పాపన్న గౌడ్ సాధారణ గౌడ నిరుపేద కుటుంబంలో పుట్టి కల్లు గీత వృత్తిని చేస్తూనే అప్పటి మొగులాయి పాలకుల నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించి 21 కొట్టాలను నిర్మించి ఏడున్నర ఏళ్లు గోల్కొండ చక్రవర్తిగా పరిపాలించిన బహుజనరాజు అన్నారు. బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవ పతాకం పాపన్నగౌడ్ అన్నారు. ప్రజలకు మంచి పాలనను అందించిన యోధుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్. పాపన్న గౌడ్ పోరాటస్ఫూర్తితో పోరాడి బహుజన రాజ్యాన్ని స్థాపించినప్పుడే పాపన్న గౌడ్‌కు అసలైన నివాళులర్పించినట్లు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉట్నూర్ లింగాగౌడ్, రాష్ట్ర కార్యదర్శి ఇల్లందుల రాజాగౌడ్, మోకుదెబ్బ జిల్లా నాయకులు కొండా బాలగౌడ్, తీగెల శ్రీనివాస్‌గౌడ్, కొండా మురళిగౌడ్, లక్ష్మణ్‌గౌడ్, కే. శ్రీనివాస్‌గౌడ్, అంజాగౌడ్, కే. రాజేశ్వర్ గౌడ్, పోతుగంటి రాజు గౌడ్‌లతో పాటు పలువురు గౌడ కులస్థులు పాల్గొన్నారు.

సర్వాయి పాపన్నను ఆదర్శంగా తీసుకోవాలి

భైంసా, ఏప్రిల్ 2 : తెలంగాణ వీరత్వానికి, పరాక్రమానికి ప్రతీకగా నిలిచిన సర్దార్ సర్వాయి పాపన్నను ప్రతిపోరుడు ఆదర్శంగా తీసుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ముథోల్ నియోజక వర్గ అధ్యక్షులు పండిత్‌రావ్ పాటిల్, వీహెచ్‌పీ భైంసా అధ్యక్షులు డా.మహిపాల్, మున్నూరుకాపు మిత్ర మండలి అధ్యక్షులు పెండప్ కాశీనాథ్‌లు పేర్కొన్నారు. మంగళవారం భైంసాలోని గురుకృపా వొకేషనల్ కళాశాలలో తెలంగాణ గౌడ సంఘం ఆధ్వర్యంలో జరిగిన సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మొగల్ రాజుల కాలంలో దౌర్జన్యాలు, అణచివేతలకు వ్యతిరేకంగా సమర శంఖం పూరించిన దీశాలి సర్వాయి పాపన్న అని తెలిపారు.మొగులుల పాలనకు వ్యతిరేకంగా దళిత, బహుజనులను తమ నాయకత్వంలో ఏకం చేసి రాజ్యాధికార పోరాటాన్ని కొనసాగించాడని వివరించారు. విప్లవ వీరుడుగా ఆయన చేసిన పోరాటం ఆదర్శనీయమని కొనియాడారు.ఈ సందర్భంగా సర్వాయి పాపన్న చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇందులో తెలంగాణ గౌడ సంఘం నిర్మల్ జిల్లా అధ్యక్షులు డా.రామకృష్ణ గౌడ్, ప్రముఖ కవి జాదవ్ పుండలీక్‌రావ్, గౌడ సంఘం ప్రతినిధులు సుధగోని శ్రీనివాస్ గౌడ్, కొండ సత్యనారాయణ గౌడ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

● సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి సందర్భంగా ఘననివాళి



జిల్లాలో పాపన్నగౌడ్‌కు నివాళులు అర్పిస్తున్న దృశ్యం

సంక్షిప్త సమాచారం

నగదు పట్టివేత



నగదును స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

కుంటాల, ఏప్రిల్, 2 : కుంటాల మండలంలోని అర్లి ఎక్స్ రోడ్డు సమీపంలో మంగళవారం అనుమతి లేకుండా తీసుకవెళుతున్న రూ.77 వేలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రజనీకాంత్ తెలిపారు. మండలంలోని అర్లిఎక్స్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా నగదు పట్టుబడినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆకతాయిల తీరుతో విద్యుత్ అంతరాయం

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 2 : ఎలపెల్లిలోని 33 కేవీ ఫీడర్‌పై గుర్తు తెలియని ఆకతాయిలు వైర్లకు ఇనుప తీగ వేయడంతో నిర్మల్ పట్టణ, విశ్వనాథ్‌పేట్ సబ్ స్టేషన్‌లకు 15 నిమిషాల పాటు విద్యుత్‌సరఫరా నిలిచిపోయినట్లు అధికారులు తెలిపారు. ఈ చర్యలు సంస్థకు చెడ్డపేరు తెస్తాయని వినియోగదారులు ఇబ్బందులకు గురవుతారన్నారు. ప్రాణాలకు సైతం ముప్పు వాటిల్లే అవకాశం ఉన్నందున జాగ్రత్తగా ఉండాలని కోరుతున్నారు.

'విమర్శలు చేసే అర్హత బీఆర్ఎస్ పార్టీకి లేదు'

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 2 : కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేసే అర్హత బీఆర్ఎస్ పార్టీకి లేదని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఎంబడి రాకేష్ ఒక ప్రకటనలో ఆరోపించారు. అధికారంలో ఉండగా భూకబ్జాలు, అవినీతికి పాల్పడిన బీఆర్ఎస్ పార్టీ చరిత్ర ఒక్కొక్కటి బయటకు వస్తాయన్నారు. ప్రభుత్వంపై విమర్శలు చేస్తే ఊరుకోబోమన్నారు.

ఎన్నికల శిక్షణకు 23 మంది గైర్హాజరు

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 2 : ఎన్నికల నిర్వహణ కోసం మంగళవారం నిర్వహించిన శిక్షణకు 23 మంది గైర్హాజరైనట్లు సహాయ ఎన్నికల అధికారి జిల్లా అధికారికి నివేదిక సమర్పించారు. 17 మంది పీవోలు, ఆరుగురు ఏపీవోలు గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. మొత్తం 623 మందిని ఎన్నికల విధులకు నియమించారు.

బీఆర్ఎస్‌కు సత్తెనపల్లి పీఏసీఎస్ చైర్మన్ రాజీనామా

ఖానాపూర్, ఏప్రిల్ 2 : బీఆర్ఎస్ పార్టీకి సత్తెనపల్లి పీఏసీఎస్ చైర్మన్ ఆమంద శ్రీనివాస్ రాజీనామా చేశారు. మంగళవారం సాయంత్రం గోసంపల్లెలో తన అనుచరులు, పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి దూరమవుతున్న నేపథ్యంలో తామంతా ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు వారు ప్రకటించారు.

పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోండి

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్2 : ఎన్నికల విధులు నిర్వహించే పీవోలు, ఏపీవోలు, ఇతర సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలని నోడల్ అధికారి రవీందర్‌రెడ్డి కోరారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం-12 శిక్షణ కేంద్రాల వద్ద ప్రత్యేక కౌంటర్‌లో అందించాలన్నారు. ఎపిక్‌కార్డు జిరాక్స్ ఎలక్షన్ ఆర్డర్ కాపీ జత చేయాల్సి ఉంటుందన్నారు. వందశాతం ఓటింగ్ పోస్టల్‌బ్యాలెట్ ద్వారా ఉపయోగించుకోవాలన్నారు.